క్లుప్తంగా

20న నకరికల్లు తిరునాళ్ల

నకరికల్లు: స్థానిక శ్రీలక్ష్మీనరసింహ స్వామి తిరునాళ్ల ఈనెల 20న నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈనెల 5వ తేదీ శుక్రవారం నకరికల్లు శ్రీలక్ష్మీనర్సింహస్వామి తిరునాళ్ల నిర్వహించాల్సి ఉండగా వర్షాల వల్ల వాయిదా వేసినట్టు వివరించారు. స్వామి కల్యాణం యథావిధిగా నిర్వహిస్తామని, తిరునాళ్లను మాత్రం 16 రోజుల పండుగ సందర్భంగా 20న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నేడు సత్తెనపల్లి ఏఎంసీ ప్రథమ పాలకవర్గ సమావేశం

సత్తెనపల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ పరిపాలన కార్యాలయ మీటింగ్ హాలులో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రథమ పాలకవర్గ సమావేశం ఈనెల 5న సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.వి.భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. సమావేశానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరవుతారని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, పాలకవర్గ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వీహెచ్‌పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్

సత్తెనపల్లి: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మంగళగిరి రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ సమక్షంలో గురువారం సత్తెనపల్లిలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎం.సుభాని, ఉపాధ్యక్షుడిగా దూదేకుల మస్తాన్ వలి, అధికార ప్రతినిధిగా ఎం.యల్లమందను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని వివరించారు.

మజ్జిగ పంపిణీ



సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో బచ్చు పవన్ సాయి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని గురువారం వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ ప్రారంభించారు. ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు దేవరపల్లి కాశీ విశ్వనాథం, తేజ, భవిరిశెట్టి హరికృష్ణ, చెక్క రవికుమార్ సహకారంతో రోజూ మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో స్వామి ప్రసాదు, వల్లెం నరసింహారావు, చిలకల వాసు, కాకర్ల రమేష్, చారి, దేవరపల్లి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసరావుపేట రూరల్: మండలంలోని గురవాయపాలెం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురవాయపాలెం గ్రామానికి చెందిన హైమాల మరియదాసు రాత్రి బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డు పక్కగా నిలబడ్డాడు. అదే సమయంలో పల్సర్ మోటార్ సైకిల్‌పై గోనెపూడి గ్రామానికి చెందిన కొయ్యలమూడి సుబ్బారావు(32) అతి వేగంగా నడుపుతూ వచ్చి మరియదాసును ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్ ద్వారా నరసరావుపేట వైద్యశాలకు తీసుకురాగా అప్పటికే సుబ్బారావు మృతి చెందాడని డాక్టర్లు ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన మరియదాసును మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

పెదకాకాని: ఆరేళ్ల బాలిక (6)పై మైనర్ బాలుడు (16) అత్యాచారానికి పాల్పడిన ఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పెదకాకాని పోలీసులు, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గడ్డిపాడులో బుధవారం ఓ బాలిక ఇంటి నుంచి తినుబండారాలు కొనుక్కునేందుకు కిరాణా దుకాణానికి వెళ్లింది. ఈ సమయంలో వర్షం కురువడంతో బాలుడు తన ఇంట్లో గొడుగు ఉంది రమ్మని చెప్పి లోపలకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్ బాబు తెలిపారు.

పంటనష్టాన్ని అంచనా వేయండి



చల్లగుండ్లలో వర్షానికి తడిసిన వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తదితరులు



అచ్చంపేటలో తడిసిన మొక్కజొన్న పంటను ఆరబెట్టిన రైతులు.

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

నకరికల్లు: అకాలవర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి సత్వరమే నివేదిక పంపాలని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చల్లగుండ్ల, దేచవరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. అకాలవర్షానికి తడిసిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం మాట్లాడుతూ అకాలవర్షానికి, ఈదురుగాలులకు వాలిన, తడిచిన ధాన్యం సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.దిలీప్‌కుమార్, రవిబాబు, కె.హనుమంతరావు, వీఆర్వో యువరాజు రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు నష్టం

అచ్చంపేట: మూడురోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కల్లాలలో ఆరబోసిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. తాళ్లచెరువు, అచ్చంపేట, కొత్తపల్లి, తదితర గ్రామాలలో సుమారు 200 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట వేశారు. పంట బాగానే పండింది. ధర కూడా ఒక మోస్తరుగా ఉండటంతో రైతులు సంబరపడిపోయారు. కోత కోసి కండె నుంచి విత్తనాలను వేరుచేసి కల్లాలలో ఆరబెట్టిన తరువాత అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలకు పంట మొత్తం తడిసిపోవడంతో ధర సగానికి సగం పడిపోయే పరిస్థితి ఏర్పడిందని, పెట్టుబడులు కూడా వచ్చే ఆస్కారం కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి రైతులకూ వర్షం నిరాశను మిగిల్చింది. మూడో కోతగా వచ్చిన మిర్చి మొత్తం కల్లాలలోనే ఉండిపోయింది. వర్షానికి పట్టాలు కప్పినా కిందనుంచి వర్షపు నీళ్లు పోవడంతో కాయలు మొత్తం మట్టి కొట్టుకుపోయాయని రైతులు చెబుతున్నారు. తడిసిన పంటనూ కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మామిడి తోటల సస్యరక్షణపై అవగాహన



మామిడి తోటల రైతులతో మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి జనని

దొడ్లేరు(క్రోసూరు): మామిడి తోటల సమస్యరక్షణ, గాలివానలు, వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం మండలంలోని దొడ్లేరు, పెరికపాడు గ్రామాల్లోని రైతులకు సత్తెనపల్లి ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ జనని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా నాటిన మొక్కల సంరక్షణకు తీసుకోవాలిసిన జాగ్రత్తలు వివరించారు. కొత్తమొక్కలకు 2–3 అడుగుల ఎత్తు ఉండే కర్రలను ఊతంగా పెట్టాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా కాలువలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే కాపుతో ఉండే తోటల విషయంలో, పూల మొగ్గలు విచ్చుకొనేదశలో, కాండంతొలిచే పురుగు నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు.

సంపద కేంద్రాలు రైతులకు ఉపయోగపడాలి



చల్లగుండ్ల గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలిస్తున్న డీపీఓ ఎం.భాస్కర్‌రెడ్డి

నకరికల్లు: తడి, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వచేసి నాణ్యమైన సేంద్రియ ఎరువుగా తయారుచేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా డీపీఓ ఎం.భాస్కర్‌రెడ్డి సూచించారు. చల్లగుండ్లలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు(సంపద కేంద్రాన్ని)ను గురువారం సందర్శించారు. నిర్వహణను పరిశీలించారు. సంపద కేంద్రం చుట్టూ ఉద్యానవనం ఏర్పాటు చేసి కేంద్రంలో తయారు చేసిన ఎరువుతో పూల, పండ్ల మొక్కలను సాగు చేయడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత రాయబారులు గ్లౌజులు, మాస్కులు ధరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వ్యర్థాల ద్వారా తయారు చేసిన ఎరువును రైతులకు అందజేయాలన్నారు. గ్రామంలోని సచివాలయంలో డీపీఓ భాస్కర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మేడికొండ రామిరెడ్డి, సర్పంచ్ అరవా ఆదిలక్ష్మీనాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గోపు పద్మావతి అంజిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, గ్రామ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావు, వీఆర్వో సి.హెచ్.యువరాజు సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్‌పై చెన్నై టు కశ్మీర్



నకరికల్లు చేరుకున్న బిశాల్

నకరికల్లు: దేశ భూభాగంలో కింద ఉండే చెన్నైని ఉన్నతశిఖరాల్లో ప్రజ్వరిల్లింపజేయడమే తన లక్ష్యమని సైకిల్ యాత్రికుడు బిశాల్ చెప్పాడు. చెన్నై నగరానికి చెందిన బిశాల్ ఇంటర్ పూర్తిచేశాడు. చెన్నై నుంచి జమ్ముకశ్మీర్‌కు సైకిల్‌యాత్రను నాలుగురోజుల క్రితం ప్రారంభించి గురువారం పల్నాడు జిల్లా నకరికల్లుకు చేరుకున్నాడు. సైకిల్‌కు జాతీయ జెండాను కట్టుకొని యాత్ర చేస్తున్న బిశాల్‌ను పలకరించగా చెన్నై నుంచి జమ్ముకశ్మీర్‌కు 2,500 కిలోమీటర్ల దూరం ఉండగా 25 రోజుల్లో కశ్మీర్ చేరుకునే లక్ష్యంతో సైకిల్‌యాత్ర చేపడుతున్నట్లు తెలిపాడు. తాను చెన్నై నుంచి తీసుకెళ్తున్న జాతీయజెండాను చెన్నై పోస్టర్‌ను కశ్మీర్‌లోని ఎత్తైన ప్రదేశంలో ఉంచుతానని తెలిపాడు. రాత్రివేళల్లో రైల్వే స్టేషన్, పెట్రోల్‌బంకుల్లో బసచేస్తూ ప్రయాణం సాగిస్తున్నట్లు తెలిపాడు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తన యాత్రకు ఎంతగానో సహకరిస్తున్నారని, ఏ గ్రామంలో బసచేస్తే ఆ గ్రామం వారే భోజన ఏర్పాట్లు చేసి సహాయం అందిస్తున్నారని చెప్పాడు. తెలుగు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపాడు.

సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలి



గోరంట్లలో అవగాహన కల్పిస్తున్న చిన్నప్ప

సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీ రైతులు పిల్లి పెసర, జీలుగ, మినుము, మొక్కజొన్న విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై తీసుకొని ఉపయోగించుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప చెప్పారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో గురువారం గ్రామ సమావేశం చర్చిలో నిర్వహించి ఎస్సీ, ఎస్టీ రైతులు, నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించారు. చిన్నప్ప మాట్లాడుతూ ప్రధానంగా ఎస్సీ రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకొని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇస్తున్న సబ్సిడీ విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు పొందాలని, సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు అందరూ వెళ్లి అదనంగా ఆదాయం పొందాలని సూచించారు. నిరుద్యోగులు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నిర్వహిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో జాబ్ మేళాలను ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్ నందిగామ రాంబాబు, వలంటీర్, సేవే ప్రాణం సేవే జీవితం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు నందిగామ నాగేశ్వరరావు, నందిగామ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఘనంగా జాలాది హరిహర క్షేత్రం వార్షికోత్సవం



నూతన వధూవరులుగా అలంకారకృతులైన చెన్నమల్లేశ్వరస్వామి, గంగాదేవి, పార్వతి

యడ్లపాడు: మండలంలోని జాలాది హరిహర దత్తక్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది. క్షేత్రం 22వ వార్షిక వేడుకలు గురువారంతో ముగిశాయి.. శైవ, వైష్ణవ ఆలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్న ఈ దత్తక్షేత్రంలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండు ఆలయాల ప్రధాన అర్చకులు శివలింగ ప్రఫుల్లాచంద్ర, పెద్ద అప్పాలాచార్యులు, చిన్న అప్పాలాచార్యులు అభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతం, రుక్మిణీ సత్యభామ, వేణుగోపాలస్వామి, గంగాపార్వతి, చెన్నమల్లేశ్వరస్వామి శాంతి కల్యాణ వేడుకలు కన్నుల పండువలా జరిపారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చివరి రోజున ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



తొండపి(ముప్పాళ్ళ): తొండపి గ్రామంలో జాతీయ కుటుంబ వైద్య సర్వే గురువారం జరిగింది. సర్వేలో భాగంగా పల్నాడు జిల్లా వైద్యాధికారి డి.శోభారాణి పర్యవేక్షణలో సిగ్నా రీసెర్చ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ బృందం సభ్యులు జి.యోహాను, కె.లక్ష్మణరాజు, ఐ.రాజు పాల్గొని గ్రామంలోని 300 కుటుంబాల ఆరోగ్య స్థితిగతులను నమోదు చేసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశుసంరక్షణ, రక్తహీనత, పోషణ, నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆంజనేయులు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.పీటర్‌డానియేల్, ఎమ్.జోస్పిన్‌రాణి, సీహెచ్‌ఓ సుగుణ, ఏఎన్ఎమ్ రాజకుమారి, ఎమ్‌పీహెచ్‌ఏ రవిచంద్ర, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం సీజ్



నిందితుడితో ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్, సిబ్బంది

క్రోసూరు: క్రోసూరు ఎస్‌ఈబీ అధికారులు అచ్చంపేట గ్రామంలో గురువారం దాడులు నిర్వహించి తెలంగాణ మద్యం విక్రయిస్తున్న కొలకలూరి రవిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి తెలంగాణ మద్యం 11 ఫుల్ బాటిళ్లు, మద్యం తరలించేందుకు ఉపయోగిస్తున్న కారును సీజ్ చేసినట్లు వివరించారు.

కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య



ఈపూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఎన్ఎస్‌పీ మెయిన్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నల్గొండ తండాలో గురువారం జరిగింది. ఎస్ఐ వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. భూక్యా రమేష్‌నాయక్ (40)కు, అతని భార్యకు అప్పు విషయంలో మనస్పర్ధలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో మనస్తాపం చెందిన రమేష్ నాయక్ ఎన్ఎస్‌పీ మెయిన్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు విషయం తెలుసుకొని మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు



ప్రతిష్ఠకు సిద్ధమైన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం

రొంపిచర్ల: మండలంలోని ఎడ్వర్డ్‌పేటలో ఆదివారం శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఉత్సవాలు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవతో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 7వ తేదీ ఉదయం 5 గంటలకు యంత్రశిల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమాల్ని బ్రహ్మశ్రీ కోట వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

60 గ్రామ సచివాలయాల్లో

‘గడప గడప’ దిగ్విజయం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- ఎర్రబాలెంలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం
- పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరిక



ఎర్రబాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఎర్రబాలెం(క్రోసూరు): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెదకూరపాడు నియోజకవర్గంలో 155 రోజులుగా దిగ్విజయంగా కొనసాగుతోంది. నియోజకవర్గంలో 72 గ్రామ సచివాలయాలు ఉండగా ఇప్పటికే 60 సచివాలయాల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా గురువారం ఎర్రబాలెం గ్రామంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల్లోని 90 శాతం గ్రామాల్లో గడప గడప కార్యక్రమం పూర్తిచేశామని పేర్కొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా మారుస్తా

అనంతరం ఎర్రబాలెం గ్రామంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి గడపా నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఎర్రబాలెం గ్రామంలో రూ.14 కోట్ల మేర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. రూ.7.45 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామని వెల్లడించారు. రూ.6.8 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయ పరిధిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, బల్క్‌మిల్క్ కేంద్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో సీసీ రోడ్లు, కల్వర్టులు నిర్మించామన్నారు. ప్రతి ఇంటికీ సురక్షిత మంచి నీరు అందించేందుకు జలజీవన్ మిషన్ పనులకు రూ.90 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో ఎర్రబాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలోని 16వ వార్డు మెంబర్, టీడీపీ నాయకుడు పైర్ల చిన్నప్ప, ఏకుల ఆనంద్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం అందరూ కలిసి కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, గల్లా గురుపాదం, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, ఎంపీపీ పి.కోటయ్య, పట్టీల శ్రీనివాసరావు, క్రోసూరు గ్రామ ఉపసర్పంచ్ షేక్ మస్తాన్, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, తోకల వెంకట్రావు, మేదర రోశయ్య, డాక్టర్ షరీఫ్, పీఏసీఎస్ అధ్యక్షుడు అనుమల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, షేక్ ఖాదర్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



పీఎండీఎస్ కిట్లను రైతులకు పంపిణీ చేస్తున్న అమలాకుమారి, సిబ్బంది

నకరికల్లు: ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యకర ఉత్పత్తులు సాధ్యమని పీఎండీఎస్ ప్రాజెక్టు పల్నాడు జిల్లా మేనేజర్ కె.అమలాకుమారి చెప్పారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాకుమారి మాట్లాడుతూ పంట కోతలు అయ్యాక ఖాళీ భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం ద్వారా 30 రకాల పోషకాలు భూమికి అందుతాయని చెప్పారు. భూమిలో కర్బన శాతం పెరిగి వానపాములు ఉత్పత్తి చెందుతాయని పేర్కొన్నారు. పిడుగురాళ్ల ఏడీఏ ఎ.శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గుడ్ అగ్రికల్చర్‌లో శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. తక్కువ ఖర్చుతో సేంద్రియ పద్ధతిలో వరిని పండించిన రైతు సాంబయ్యను సన్మానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వచ్చిన ఉద్యోగులకు సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు బదిలీపై వచ్చిన ఇద్దరు గెజిటెడ్ ఆఫీసర్స్ ఎం.రాధా(నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2), జి.విజయలక్ష్మి (ఫార్మసీ సూపర్‌వైజర్)ను ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం సన్మానించి స్వాగతం పలికారు. వైద్యశాల సూపరింటెండెంట్ ఈటిపోగు వెంకట్రావు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఒక్క రేడియాలజిస్టు తప్ప అన్ని ఉద్యోగ ఖాళీలూ భర్తీ అయ్యాయని వెల్లడించారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ వైద్యశాలలో ఎవరు విధుల్లోచేరినా సన్మానించడం సంప్రదాయంగా పెట్టుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ శోభారాణి, మెడికల్ సూపర్‌వైజర్ పద్మావతి, హెడ్ నర్స్ రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



మస్టర్‌ను పరిశీలిస్తున్న ఏపీవో నాగేశ్వరరావు

నరసరావుపేట రూరల్: ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని ఏపీవో కట్టా నాగేశ్వరరావు సిబ్బందికి చెప్పారు. మండలంలోని కాకానిలో పనుల్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలు ఎండ వేడిమికి గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కూలీలకు రోజుకు రూ.270 వచ్చేలా కనీసం నాలుగు గంటలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వేముల శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్స్ మరియబాబు, తిరుపతిరావు పాల్గొన్నారు.